ప్రజా విశ్వంభర
V3 NEWS

# గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ పనుల్లో వేగం పెంచండి : పవన్ కళ్యాణ్



విశ్వంభర,ఏపీ బ్యూరో: తీర ప్రాంత రక్షణ చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ పనుల్లో వేగం పెంచాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పనుల పురోగతిపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. డివిజన్లవారీగా నిర్దేశించిన లక్ష్యం ఏ మేరకు పూర్తైంది? ఎన్ని మొక్కలు నాటారు? మడ అడవులు విస్తీర్ణంలో పెరుగుదల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీబీ జీ రాం జీ పథకంలో భాగంగా తీర ప్రాంత జిల్లాలకు అదనంగా మరో 70 లక్షల మొక్కలు కేటాయించారని గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్య సాధనకు ఇది అదనపు బలమని పేర్కొన్నారు. మడ అడవుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధించడం ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చినందుకు కృషి చేసిన అధికారులకు పవన్ కళ్యాణ్ అభినందనలు తెలియజేశారు. ఎల్?నినో వంటి అసాధారణ వాతావరణ పరిస్థితుల నుంచి తీరాన్ని రక్షించుకోవడంలో గ్రీన్ వాల్ ప్రాజెక్టు కీలకమన్నారు. 1053 కిలోమీటర్ల తీరం పొడవునా 5 కిలోమీటర్ల వెడల్పున హరితగోడను ఏర్పాటు చేస్తున్నామని ఈ ఏడాది 8888 హెక్టార్లలో గ్రీన్ వాల్ విస్తరణ జరగనుందని వివరించారు. తాటి చెట్లు గాలి నిరోధక వ్యవస్థగా నిలుస్తాయని చెప్పారు. అందుకే తాటివనాలు, సామాజికవనాల ఏర్పాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని పవన్ సూచించారు.మడ అడవుల స్థాపనకు అక్టోబర్ నుంచి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని, ఈ ఏడాది మరింత వేగంగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని అధికారులను పవన్ ఆదేశించారు. గ్రీన్ వాల్ కార్యాచరణ ప్రణాళికల్లో భాగంగా 5000ల హెక్టార్లలో తాటి వనాలు నాటుతున్నామని, గ్రీన్ క్లైమేట్ ఫండ్ కింద మరో 1993 హెక్టార్లను దేశీయ మొక్కలతో నింపుతామని వివరించారు. 727 హెక్టార్లలో షెల్టర్ బెల్ట్ ప్లాంటేషన్లు లక్ష్యాలుగా నిర్దేశించినట్లు చెప్పారు. గ్రేట్ గ్రీన్ వాల్ కింద 5 కిలోమీటర్ల వెడల్పుతో తీరానికి మూడంచెల రక్షణ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. మొదటి వలయంలో మడ అడవుల పునరుద్ధరణ, షెల్టర్ బెల్ట్‌ల మొక్కల పెంపకం, రెండు, మూడు వలయాలను కమ్యూనిటీ బఫర్ జోన్లుగా గుర్తించి గ్రామ వనాలు, సామాజిక వనాలు, వ్యవసాయ వనాల పెంపకాన్ని ప్రజలు, వివిధ శాఖల సమన్వయంలో చేపడుతున్నట్లు పవన్ కళ్యాణ్ వివరించారు. గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్తోందనని చెప్పారు. ఏపీ గ్రీనింగ్ అండ్ క్లైమెట్ ఛేంజ్ మిటిగేషన్ సొసైటీ ద్వారా గ్రీన్?వాల్ లక్ష్య సాధన దిశగా అన్ని శాఖలను సమన్వయం చేస్తున్నట్లు పవన్? కళ్యాణ్? తెలిపారు.

# ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్

## అధికారిక బులెటిన్ విడుదల చేసిన ఏపీ అసెంబ్లీ



విశ్వంభర, ఏపీ బ్యూరో: ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బుసినె విరూపాక్షిని పోలీసులు అరెస్టు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ శాసనసభ అధికారిక బులెటిన్ విడుదల చేసింది. ఆగస్టు 2న తెల్లవారుజామున 3 గంటలకు కర్నూలు జిల్లా చిప్పగిరి గ్రామంలోని ఆయన నివాసంలో ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అరెస్టు చేసినట్లు వెల్లడించింది. చిప్పగిరి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 37/2026 కేసులో ఎమ్మెల్యే బుసినె విరూపాక్షిని ఏ-1గా చేర్చినట్లు బులెటిన్‌లో వెల్లడించింది.క్రైమ్ నంబర్ 38/2026 కేసులో కూడా ఆయన ఏ-1 నిందితుడిగా ఉన్నట్లు తెలిపింది. ఈ కేసులో భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల నిరోధక చట్టంలోని సెక్షన్లు కూడా నమోదు చేసినట్లు శాసనసభ సభ్యులకు అధికారికంగా తెలిపింది. ఈ మేర అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు.అసలేం జరిగింది? అంటే కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం సంగాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గురునాథ్, వైఎస్సార్సీపీ కార్యకర్త గిరి శనివారం ఏదో విషయమై ఫోన్లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో గిరి ఇంటికి గురునాథ్‌తో పాటు టీడీపీకే చెందిన సుధాకర్, చంద్రశేఖర్, నేమకల్లు గ్రామానికి నాగరాజు, శివ వెళ్లారు. వారి మధ్య తోపులాట జరగడంతో గ్రామస్థులు నచ్చజెప్పి పంపేశారు. తనను టీడీపీ కార్యకర్త దూషించాడని ఎమ్మెల్యే విరూపాక్షికి గిరి ఫిర్యాదు చేశాడు. దీంతో చిప్పగిరి నుంచి విరూపాక్షి తన కుమారుడు చంద్రశేఖర్, ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాములు ఆయన కుమారుడు మధు తదితరులు సుమారు 50 మంది వాహనాల్లో కర్రలు, రాళ్లు, రాడ్లతో తొలుత సంగాల వెళ్లారు. అక్కడ టీడీపీ కార్యకర్త చంద్రశేఖర్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆ తర్వాత వారంతా నేమకల్లు వెళ్లారు. అక్కడ రాళ్లు రువ్వుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాములు కింది పడిపోవడంతో అతని చేయి విరిగింది. దీనికి టీడీపీకు చెందిన నాగరాజు కారణమని భావించిన ఎమ్మెల్యే విరూపాక్షి, అనుచరులు అతని ఇంటికి వెళ్లారు.

అక్కడ ఆయన భార్య సుచిత్రతో అభ్యంతరకరంగా ప్రవర్తించారు. ఆమె దుస్తులను చించివేశారు. ఇంట్లోకి దూసుకెళ్లి టీవీ, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. నాగరాజును చంపేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. దీంతో నాగరాజు బయటకు వచ్చి వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా ఆయనపైనా దాడికి దిగారు. కుటుంబసభ్యులు ప్రతిఘటించడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే విరూపాక్షి దాడికి వెళ్లబోతున్నారని సంకేతాలు రావడంతో ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి ముందే వారించారు. అయినా, వినిపించుకోలేదని తెలిసింది.

# స్పర్శదర్శనం, వసతి కోసం 2 రోజుల ముందు సిఫార్సు లేఖలు పంపాలి

## శ్రీశైలం ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు




విశ్వంభర, శ్రీశైలం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం వచ్చే ప్రముఖులు దర్శనం, వసతి గదుల కోసం తమ సిఫార్సు లేఖలను 2 రోజులు ముందుగా దేవస్థానానికి పంపాలని ఈవో ఎం.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. సిఫార్సు లేఖలు ఉన్నవారికి శని, ఆది, సోమవారాల్లో ఉదయం, మధ్యాహ్నం వేళల్లో స్పర్శదర్శనం ఉండదని, రాత్రివేళ అనుమతిస్తామన్నారు.మంగళవారం నుంచి గురువారం వరకు రోజుకు యథావిధిగా 3 విడతలు స్పర్శదర్శనం కల్పిస్తున్నట్లు ఈవో చెప్పారు. శ్రావణమాసంలో శుక్రవారం రాత్రి పరిమితంగా స్పర్శదర్శనానికి అనుమతించనున్నట్లు చెప్పారు. సిఫార్సు లేఖలను protocol@srisailadevasthanam.org, ప్రొటోకాల్ వాట్సప్ నంబరు 91600 16215కు పంపాలని కోరారు. స్వామి దర్శనం కోసం శ్రీశైలం వచ్చే భక్తులు ప్రయాణానికి ముందే ఆలయ అధికారిక వెబ్?సైట్?లో వసతి గదులు ఆర్జిత సేవా టికెట్లను బుక్ చేసుకోవడం ఉత్తమం. క్యూలైన్లలో గంటల కొద్ది వేచి ఉండే భక్తుల కోసం దేవస్థాన సిబ్బంది పాలు, మజ్జిగ, తాగునీరు, అల్పాహారం వంటి వసతులను అందిస్తోంది. సామాన్య భక్తులందరికీ మల్లన్న దివ్య దర్శనం సజావుగా సాగేలా చూడటమే ఈ మార్పుల ముఖ్య ఉద్దేశం అని అధికారులు తెలిపారు. భక్తులు శ్రీశైల మహాక్షేత్రానికి వెళ్లే ముందు అధికారుల సూచనలను పాటిస్తూ సిబ్బందికి సహకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. శ్రీశైల మల్లన్న దర్శనం కోసం భక్తులు భారీగా తరలి వస్తున్నారు. భక్తుల రద్దీ ఎక్కువవడంతో స్పర్శ దర్శనాలను ఆన్‌లైన్ ద్వారా ముందుగా బుక్ చేసుకున్న వారికే కల్పించారు. మిగతా భక్తులకి అలంకార దర్శనాలు మాత్రమే కల్పించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో కంపార్టుమెంట్లు, క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు అల్పాహారాలు, మజ్జిగ, పాలు, తాగునీరు అందించారు. ఇటీవల శ్రీశైలం దేవస్థానం ధర్మకర్తల మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఛైర్మన్ రమేశ్ నాయుడు ఆధ్వర్యంలో సమావేశమైన సభ్యుల కమిటీ 39 అంశాలకు ఆమోదం తెలిపింది. శ్రీశైలం దేవస్థానం ప్రొటోకాల్ దర్శనాల్లో సంస్కరణలు చేపట్టినట్లు ఛైర్మన్ వెల్లడించారు. ఈ నెల 15 నుంచి తిరుమల తరహాలో శ్రీశైలంలోనూ ఆన్‌లైన్ ప్రొటోకాల్ టికెట్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో శ్రీశైలంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టబోతున్నట్లు చెప్పారు.

## సైన్ బోర్డును ఢీకొన్న బైక్.. ఇద్దరి మృతి

విశ్వంభర, కొడవలూరు: నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రాచర్లపాడు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సైన్ బోర్డును బైక్ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మృతులను ఒడిశాకు చెందిన బాదల్, జనసితల్‌గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పాపులర్ షూమార్ట్ అధినేత చుక్కపల్లి విజయ్ కుమార్ మృతి



విశ్వంభర, పాపులర్ షూమార్ట్ అధినేత చుక్కపల్లి విజయ్ కుమార్ సోమవారం ఉదయం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన మృతి విజయవాడ వ్యాపార వర్గాలను, సన్నిహితులను తీవ్ర విషాదంలో ముంచింది. విజయవాడ కేంద్రంగా ఆరు దశాబ్దాలకు పైగా ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన ప్రముఖ వ్యాపార సంస్థగా పాపులర్ షూమార్ట్ పేరుగాంచింది. కాగా, విజయ్ కుమార్ మృతి పట్ల ఎమ్మెల్యే సుజనా చౌదరి సంతాపం తెలిపారు.

## ఏపీలో మరో కొత్త రాజకీయ పార్టీ..

### మహిళలు, రైతులు, యువతే లక్ష్యం



విశ్వంభర, ఏపీ బ్యూరో: రాష్ట్రంలో మరో కొత్త పార్టీ ఆవిర్భావం కాబోతోంది. వైసీపీ మాజీ ఎంపీ, సీనియర్ నేత విజయసాయిరెడ్డి త్వరలో కొత్త పార్టీ పెట్టాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఆయన అడుగులు వేస్తున్నారు. మహిళలు, యువతే లక్ష్యంగా అజెండా రూపొందించేందుకు కసరత్తులు చేస్తున్నారు. ఇందులో భాగంగా త్వరలో సన్నాహక సభలు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే ప్రాంతాల వారీగా కూడా సభలు, సమావేశాలు రూపొందించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. మహిళలు, రైతులు, యువత లక్ష్యంగా అజెండా తయారు చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ, వైసీపీకి ప్రత్యామ్నాయంగా కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ఇప్పటికే విజయసాయిరెడ్డి ప్రకటన చేసిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఆ దిశగా ఆయన శరవేగంగా అడుగులు వేస్తున్నారు.

## మాజీ మంత్రి అప్పలరాజు పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతి



విశ్వంభర, కాశీబుగ్గ: వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును ఒక రోజు పోలీస్ కస్టడీకి పలాస జూనియర్ సివిల్ జడ్జి అనుమతిచ్చారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో గతనెల 10న జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన విషయం విదితమే. ఈ కేసులో అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ, సిద్ధార్థ త్యాడీలను పోలీసులు అరెస్టు చేయగా బెయిల్‌పై విడుదలయ్యారు. ఇదే కేసులో ఏ3గా ఉన్న అప్పలరాజును అరెస్టు చేయగా ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా అంపోలులోని జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ క్రమంలో పలాస పోలీసులు అప్పలరాజు కస్టడీకి పిటిషన్ వేయగా ఒక రోజు అనుమతిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు విచారించే అవకాశముంది.

## విద్యాశాఖ మంత్రిగా లోకేష్ పనికిరాడు: కాకాణి



విశ్వంభర, ఏపీ బ్యూరో: విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలకు ఏమాత్రం తగరని, ఆయనకు ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. గత పాలన విషయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో చర్చించడానికి లోకేష్ స్థాయి ఏమాత్రం సరిపోదని ఆయన ఎద్దేవా చేశారు. అసలు విద్యాశాఖపై కనీస అవగాహన లేకుండా లోకేష్ నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. లోకేష్ ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని కాకిని గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు.

**డీఎస్సీ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు..**

రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ ప్రక్రియలో తీవ్ర అక్రమాలు, అన్యాయాలు జరిగాయని కాకాణి ఆరోపించారు. అర్హత లేని దాదాపు 400 మందికి పైగా అభ్యర్థులకు అక్రమంగా ఉద్యోగాలు కట్టబెట్టారని, దీనిపై కూటమి ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కష్టపడి చదివిన అర్హులైన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవడం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ, రాజకీయాల్లో నైతిక విలువలను కాపాడటానికి లోకేష్ వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## లంచం కేసులో కడప విమానాశ్రయం మాజీ అధికారికి మూడేళ్ల జైలు



విశ్వంభర, కడప: లంచం తీసుకుంటూ పట్టుబడిన కడప విమానాశ్రయం మాజీ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్, ఏజీఎం (ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్) ముకుందగిరి రంగాచారి శ్రీనివాసన్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కర్నూలు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. శిక్షతో పాటు రూ.50,000 జరిమానా చెల్లించాలని ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే.. ఓ వ్యక్తికి సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరగా మంజూరు చేయడంతో పాటు, ఆయన సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకుండా ఉండేందుకు శ్రీనివాసన్ రూ.50,000 లంచం డిమాండ్ చేశారు. దీనిపై బాధితుడు సీబీఐ అధికారులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన సీబీఐ అధికారులు.. పక్కా ప్రణాళిక ప్రకారం తొలి విడతగా రూ.25,000 లంచం తీసుకుంటుండగా శ్రీనివాసన్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీనిపై 2015 జులై 24న సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. 2016 ఫిబ్రవరి 29న ఛార్జిషీట్ దాఖలు చేశారు. సుదీర్ఘ వాదనలు అనంతరం అభియోగాలు రుజువు కావడంతో తాజాగా న్యాయస్థానం నిందితుడికి శిక్ష ఖరారు చేసింది.

## జగన్ క్రెడిట్ అంటే నాలుగు కత్తులు.. నాలుగు గొడ్డళ్లు : మంత్రి సంధ్యారాణి




విశ్వంభర, అమరావతి: వైసీపీలోని కొందరు నేతలు ప్రజలకు నీతులు చెబుతున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఎద్దేవా చేశారు. నేరాలు చేసిన నేతలు ఎక్కడున్నా తీసుకొచ్చి శిక్షిస్తామన్నారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. భోగాపురం విమానాశ్రయంపై వైకాపా నేతల వ్యాఖ్యలు సరికాదన్నారు. "మేం చేసిన పనులను జగన్ క్రెడిట్ చోరీ చేస్తున్నారు. ఆయనకు క్రెడిటే లేదు.. చోరీ ఎక్కడిది. క్రెడిట్ అనే పదం జగన్‌కు వర్తించదు. ఆయన క్రెడిట్ అంటే.. నాలుగు కత్తులు, నాలుగు గొడ్డళ్లు. హత్యలు చేసినవాళ్లని వెనకేసుకుని రావడం, బూతులు మాట్లాడిన వాళ్లకు మంత్రి పదవులు ఇవ్వడమే ఆయనకు తెలుసు. శస్త్రచికిత్స చేయించుకున్న సొంత చెల్లినే పరామర్శించలేదు. నేరాలు చేసి జైళ్లలో ఉన్నవారిని మాత్రం జగన్ పరామర్శిస్తున్నారు" అని సంధ్యారాణి విమర్శించారు.

## దుర్గమ్మకు రూ.17 లక్షల స్వర్ణకాసుల హారం కానుక




విశ్వంభర, విజయవాడ: విజయవాడ దుర్గమ్మకు నగరంలోని లబ్బీపేటకు చెందిన దొండేటి ఐశ్వర్య జ్యోతి కుటుంబ సభ్యులు అపురూపమైన స్వర్ణాభరణాన్ని కానుకగా సమర్పించారు. సుమారు రూ.17లక్షల విలువైన 108 గ్రాముల పవిత్రమైన స్వర్ణలక్ష్మి కాసుల హారాన్ని సమర్పించారు. దొండేటి ఐశ్వర్యజ్యోతి కుటుంబ సభ్యులు ఆలయ డిప్యూటీ ఈవో కిశోర్‌కుమార్‌ను కలసి స్వర్ణకానుకను అందజేశారు. అనంతరం దాతలకు అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి వేదాశీర్వచనం అందించారు.

## జగన్ కళ్లలో ఆనందం కోసమే వైసీపీ నేతల ఘోరాలు : మంత్రి పార్థసారథి



విశ్వంభర, అమరావతి: వైసీపీ నేతలు రాష్ట్రంలో చేస్తున్న అలజడులను చూసి ప్రజలు ఛీకొడుతున్నారని మంత్రి పార్థసారథి అన్నారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలు జిల్లాలో వైకాపా ఎమ్మెల్యే విరూపాక్షి వ్యవహరించిన తీరుపై మంత్రి ఓ వీడియో విడుదల చేశారు. వైసీపీలో నేతలు కొనసాగాలంటే అరాచకాలు చేయాలని.. జగన్ కళ్లలో ఆనందం కోసమే ఘోరాలు చేస్తున్నారని మంత్రి దుయ్యబట్టారు. ఆ పార్టీ నేతలకు చట్టం అంటే భయం లేదని మండిపడ్డారు. దళితుల ఇంటిపై దాడికి పాల్పడి అరాచకం సృష్టించిన నేపథ్యంలో ఎమ్మెల్యే విరూపాక్షిని వైకాపా నుంచి సస్పెండ్ చేయాలని పార్థసారథి డిమాండ్ చేశారు.

## సీఆర్డీఏ ఇంజినీర్లతో మంత్రి నారాయణ సమీక్ష



విశ్వంభర, అమరావతి: సచివాలయంలో సీఆర్డీఏ ఇంజినీర్లు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. సమీక్షకు ఏడీసీఎల్ ఎండీ అభిషేక్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ గోపాలరెడ్డి, చీఫ్ ఇంజినీర్లు హాజరయ్యారు. అమరావతిలో నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల పనుల పురోగతిపై చర్చించారు. అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్ల పనులు జరుగుతున్న తీరును మంత్రి అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలోనూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు కొనసాగుతు న్నాయని అధికారులు తెలిపారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ సూచించారు.

## ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో ప్రేమలేఖలు కలకలం.. కేసులో కొత్త ట్విస్ట్!



విశ్వంభర, హైదరాబాద్: ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి మరో మహిళతోనూ సన్నిహిత సంబంధాలుండేవని పోలీసులు దర్యాప్తులో గుర్తించినట్లు తెలిసింది. తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ట్రైనీ మహిళా ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నగర మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్యానాయక్ జాదవ్ దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. నిందితుడు మరో మహిళతోనూ సంబంధాలు నెరిపినట్లు బాధితురాలు(ట్రైనీ మహిళా ఐపీఎస్) మౌఖికంగా ఫిర్యాదు చేయగా.. ఆ దిశగా దర్యాప్తు చేసిన అధికారులు కీలక ఆధారాలు రాబట్టినట్లు తెలిసింది. అశోక్‌నగర్‌లోని ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో పోలీసులు సోదాలు నిర్వహించారు. ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, ఇద్దరు వ్యక్తుల చేతిరాతతో ఉన్న రెండు ప్రేమలేఖలు, కత్తి స్వాధీనం చేసుకున్నారు. ప్రేమలేఖలపై రాసిన పేర్ల ఆధారంగా ఆరా తీసిన పోలీసులకు కొత్త ఆధారం లభించింది.

## మామను కత్తితో పొడిచి చంపిన అల్లుడు

విశ్వంభర, సర్వేపల్లి : మామను అల్లుడు కత్తితో పొడిచి చంపిన ఘటన నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలో బలిజిపాలెంలో చోటుచేసుకుంది. భార్యభర్తల మధ్య గొడవ జరుగుతుండగా.. అడ్డుకునేందుకు మామ వెళ్లాడు. ఈ క్రమంలో మామ ఏడుకొండలుపై అల్లుడు గున్నస్వామి కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. భర్త దాడిలో భార్య మస్తానమ్మకు కూడా గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.